**జరిగిన కథ :** సప్తమిత్ర చరిత్రలో మధిర సుబ్బన్న దీక్షితులు రచించిన మదాలస వృత్తాంతాన్ని చెప్పుకొంటున్నాం. కువలయాశ్వుడనే మహావీరుణ్ని పెళ్లాడిన మదాలస భర్తపై ప్రేమ కొద్దీ.. అతని అసత్య మరణవార్త విని మరణించింది. కువలయాశ్వుని మిత్రుల తండ్రి అయిన నాగరాజు ఆమెను తన కూతురిగా పొందడానికి తపస్సు చేశాడు.






అనుసృజన: నేతి సూర్యనారాయణ శర్మ

# అలర్కుని చరిత్ర

అశ్వతరుని వల్ల మదాలస తిరిగి జన్మించింది.

కిందటిసారి ఆమె మరణించినప్పుడు ఏ వయసులో ఉందో.. ఇప్పుడూ అదే వయసులో ఉంది. పూర్వజన్మ స్మృతి అలాగే ఉంది. ఆమెను అలాగే తన ఆంతరంగిక మందిరంలో ఉంచి, ఎవరికంటా పడకుండా కాపాడసాగాడు నాగరాజు అయిన అశ్వతరుడు.

తన కుమారులిద్దరినీ పిలిచి..

''నాయనలారా! ఆ కువలయాశ్వుణ్ని మనింటికి తీసుకురండి'' అని ఆజ్ఞాపించాడు.

నాగ కుమారులిద్దరూ ఎప్పటిలాగే బ్రాహ్మణుల వేషం వేసుకుని, కువలయాశ్వుని వద్దకు వెళ్లారు. వారు తెచ్చిన సందేశం విని..

''మీ తండ్రిగారి ఆజ్ఞ అయితే తప్పకుండా పాటించాల్సిందే! ఇప్పుడే వస్తాను'' అన్నాడు కువలయాశ్వుడు.

నాగ కుమారులిద్దరూ కువలయాశ్వుణ్ని గోమతిలో ముంచి పాతాళానికి తీసుకుపోయారు. అక్కడికి వెళ్లిన వెంటనే వారి రూపాలు మారిపోవడం గమనించి ఆశ్చర్యపోయాడు కువలయాశ్వుడు.

అక్కడ అనేక విశేషాలు కనిపించాయి. మనోహరమైన వీధులు, భవంతులతో ఒప్పుతున్న పాతాళ నగరాన్ని గమనిస్తూ.. క్రమంగా అనేక సౌధాలను దాటి అశ్వతరుని భవంతికి వెళ్లారు.

అక్కడ హారాలు, కుండలాలు, కేయూరాలు మొదలైన విభూషణాలు ధరించి దివ్యవస్త్రాలను ధరించి.. రత్నసింహాసనంపై కూర్చుని ఉన్న అశ్వతరుణ్ని నాగకుమారులు తమ మిత్రునికి చూపారు.

అశ్వతరుడు ఆసనం దిగివచ్చాడు. కువలయాశ్వుణ్ని ఆలింగనం చేసుకున్నాడు.

''రాజపుత్రా! నేను నీకు తండ్రి వంటివాణ్ని. చిరకాలానికి మా ఇంటికి వచ్చావు. మా ఇంటిలో ఉన్న ధనకనక వస్తువాహనాలలో నీకేది కావాలో కోరుకో!'' అన్నాడు అశ్వతరుడు.

అందుకు కువలయాశ్వుడు..

''మహాత్మా! నేను తండ్రిచాటు పిల్లవాణ్ని. మీరీ పాతాళ లోకాన్ని పాలిస్తున్నట్లే నా తండ్రి వెయ్యేళ్ల నుంచి భూమండలాన్ని పాలిస్తున్నాడు. ద్రవ్యం లేని వారు కోరుకోవడం ఉచితం. అన్నీ సంపూర్ణంగా ఉన్న వారు కూడా మళ్లీ ఎవరినో ఏదో ఇమ్మని కోరుకోవడానికి ఎలా నోరు వస్తుంది. మీ పాదదర్శనం కలిగింది. అంతేచాలు!'' అని జవాబిచ్చాడు.

''పోనీ.. నీకు ప్రియమైన వస్తువేదైనా అడుగు కుమారా!''.

''తమ పరిష్వంగం కంటే ప్రియమైన వస్తువు ఎక్కడుంది?''.

..వారి సంభాషణ అలా జరుగుతుండగా, నాగకుమారులు మధ్యలో కల్పించుకున్నారు.

''తండ్రీ! అతనికి ప్రియమైన వస్తువేమిటో మేము చెబుతాం. ఇటీవలే మరణించిన మా మిత్రుని భార్యను తిరిగి తీసుకువస్తే చాలు. ఆమెకంటే ప్రియమైనది ఏడేడు లోకాల్లో అతనికి ఇంకేమీ లేదు'' అని చెప్పారు.

''సరే.. మీరొక్కసారి ఆ గదిలోకి వెళ్లి, ఆమెను తీసుకురండి'' అని కుమారులతో చెప్పి..

''కువలయాశ్వుడా! నీకిప్పుడు ఒక మాయను చూపిస్తాను. దానితో నువ్వు విరహమే అనుభవిస్తావో, తృప్తినే పొందుతావో.. అదుగో! నీ భార్య వస్తున్నది. కానీ, ఆమె మాయా మదాలస. తాకితే మాయమై పోగలదు'' అని హెచ్చరించాడు.

అంతలో మదాలస వచ్చి, భర్త ముందు నిలబడింది.

ఆమెను చూడగానే కువలయాశ్వుని కన్నులు విచ్చుకున్నాయి. తమకం పట్టలేకపోయాడు. కానీ, ముట్టుకుంటే మాయమై పోతుందనే భయంతో.. ఆమెకు దూరంగా కూర్చుని కన్నీరు పెట్టుకోసాగాడు.

అతని బాధను చూడలేక, అశ్వతరుడు దగ్గరికి వచ్చాడు.

''వత్సా! నువ్వు ప్రాజ్ఞుడివై ఉండి కూడా ఇలా దుఃఖిస్తావెందుకు? చూడు.. నీ బాధను నా పుత్రులు ముందే నాకు ఎరిగించారు. నేను పరమశివుని కోసం తపస్సు చేసి, ఆమెను పునర్జీవితురాలిని చేశాను. ఒకవిధంగా ఈమెకిది పునర్జన్మ. దేవతాప్రసాదం. ఈమె మాయా మదాలస కాదు. ఈమెను పరిగ్రహించు'' అని చెప్పాడు.

కువలయాశ్వుడు దంపతీ సమేతంగా అశ్వతరునికి నమస్కరించాడు. తదుపరి వాళ్లు పాతాళం నుంచి తమ నివాసానికి తిరిగి వెళ్లిపోయారు.

కువలయాశ్వుని తండ్రి అయిన శత్రుజిత్తు చిరకాలం రాజ్యాన్నేలాడు. చివరికి రాజ్యభారం కొడుక్కి అప్పగించి, వానప్రస్థానికి వెళ్లిపోయాడు.

అటుపైన కువలయాశ్వునికి ఒక కుమారుడు పుట్టాడు. అతనికి విక్రాంతుడు అని కువలయాశ్వుడే పేరు పెట్టాడు. ఆ పేరు విని మదాలస నవ్వింది. ఆ నవ్వుకి అర్థమేమిటో తెలియలేదు.

కానీ, పిల్లవాడికి పాలు పడుతూ, ఊయలలో నిద్రపుచ్చుతూ..

''తండ్రీ! నువ్వు కేవలం పరమాత్మవు. నీకు కల్పనగా ఈ పేరు పెట్టబడింది'' అంటూ ప్రతిరోజూ బోలెడంత తత్వబోధ చేసింది. ఆ బోధలన్నీ విన్న విక్రాం